సాక్షి
నిర్మల్
శుక్రవారం । 14 । జూన్ । 2024



ప్రాణం పోస్తున్నారు.. 8లో▸
రక్తదానం.. ప్రాణాలు నిలబెడుతుంది. ఇది గుర్తించిన భైంసా యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వస్తోంది. నాలుగు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేసి బ్లడ్ డొనేట్ చేస్తున్నారు.



అధికం.. అనర్థమే..! 9లో▸
పంటల దిగుబడి కోసం రైతులు రోజు రోజుకూ రసాయనిక ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో నేలలో పోషకాలు తగ్గి పంటల దిగుబడిలపై ప్రభావం చూపుతోంది.

గరిష్టం/కనిష్టం
36.3 /26.8

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి దేవేంద్రబాబు

భైంసాటౌన్: మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో అందించే ఉచిత న్యాయ సలహాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ చైర్మన్, భైంసా కోర్టు న్యాయమూర్తి డి.దేవేంద్ర బాబు అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయసేవలు పొందలేని పేదలు మండల న్యాయ సేవాసంస్థను సంప్రదించడం ద్వారా ఉచిత న్యాయసేవలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కోర్టు పర్యవేక్షణ అధికారి అమర్‌నాథ్, న్యాయవాదులు సాయినాథ్, భీంరావు, రఘువీర్, మాధవి తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీపీవో శ్రీనివాస్



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీపీవో శ్రీనివాస్ సూచించారు. వర్షాకాలం దృష్ట్యా కుంటాలలోని రైతు వేదికలో సిబ్బందితో గురువారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి విధిగా క్లోరినేషన్ చేయాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలను చైతన్య పర్చాలన్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న మిషన్ భగీరథ ఇంటింటా సర్వేను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. మండల అభివృద్ధికి కలిసికట్టుగా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గజ్జరాం యాదవ్ కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో ఎంఏ.రహీం, వైద్యురాలు శ్వేతిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మి విశారద, కోఆప్షన్ సభ్యుడు గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ప్రమోషన్ల కోసం వెబ్ ఆప్షన్లు

నిర్మల్ రూరల్: జిల్లాలో ఎస్జీటీ క్యాడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌కు ప్రమోషన్ కోసం ఉపాధ్యాయుల వెబ్ ఆప్షన్ నమోదు గురువారం సాయంత్రం నుంచి మొదలైంది. వెబ్ ఆప్షన్ల నమోదుకు శుక్రవారం వరకు సమయం ఉండగా శని, ఆదివారాల్లో ఆయా ఉపాధ్యాయులకు పాఠశాలల అలాట్మెంట్ దక్కుతుంది. తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ పండితులకు, పీఈటీలకు పీడీలుగా, ఇతర తత్సమాన క్యాడర్లకు ప్రమోషన్ కోసం ఆరు రోజులుగా ప్రక్రియ కొనసాగుతోంది. ఆదివారంలోపు ప్రమోషన్ల ప్రక్రియ ముగుస్తుంది. సోమవారం నుంచి ఎస్జీటీల బదిలీల ప్రక్రియ మొదలవుతుంది. ఇదిలా ఉండగా ఎస్జీటీలు కూడా తమకు కామన్ సర్వీస్ వర్తింపజేస్తూ పండిత, పీఈటీ ప్రమోషన్లు ఇవ్వాలని కొందరు ఉపాధ్యాయులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం మధ్యాహ్నం తీర్పు వస్తుందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. వీరికి ప్రమోషన్లు ఇవ్వడం సబబే అని హైకోర్టు ఇటీవలే తీర్పు ఇచ్చింది. ఇప్పుడు సుప్రీంకోర్టు ఏం చెబుతుందన్న ఉత్కంఠ ఉపాధ్యాయవర్గాల్లో నెలకొంది.

మళ్లీ మునగాల్సిందేనా..?

- భయపెడుతున్న 'కడెం'
- దిగువను ముంచేస్తున్న 'స్వర్ణ'
- భైంసాను భయపెడుతున్న 'గడ్డెన్న'..
- ఆక్రమణలతో.. జలసంద్రం అవుతున్న జిల్లా కేంద్రం
- కానరాని ముంపు నివారణ చర్యలు



గత వానాకాలంలో వరదలకు నీట మునిగిన భైంసాలోని కాలనీలు



కడెంప్రాజెక్టు గేట్లపైనుంచి వరద ప్రవాహం(ఫైల్)



నిండా మునిగిన జీఎస్ఆర్ కాలనీ(ఫైల్)

నిర్మల్: భారీ వర్షాలంటేనే.. ఆ ప్రాంతాలు భయంతో వణికిపోతాయి. ఎక్కడి నుంచి వరద ముంచెత్తుతుందోనన్న భయం వారిని ఇంకా వెంటాడుతూనే ఉంది. అసలు వానాకాలమంటేనే.. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయాందోళన. ఇళ్లువాకిలి, గొడ్డు గోదా అన్నీ నీళ్లకొదిలి.. ఎక్కడికో వెళ్లి బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన దుస్థితి. నిద్రలేని రాత్రులు గడపాల్సిన కష్టం. ఇలా.. ఇంకెన్నాళ్లు..? అని జిల్లాలోని ముంపుప్రాంతాల బాధితులు వాపోతున్నారు.

సుద్దవాగు నుంచి కడెం వరకు..

జిల్లాలో భైంసా సుద్దవాగు నుంచి కడెం ప్రాజెక్టు వరకు.. ప్రతీ వానాకాలం వరదలతో భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రమైతే జలసంద్రంగా మారిపోతోంది. మూడేళ్లుగా నిర్మల్ కూడా నీటమునుగుతూనే ఉంది. ప్రజలు పడుతున్న ఈ కష్టాలను ప్రజాప్రతినిధులు, అధికారులు కేవలం ప్రకృతి విపత్తుల కింద కొట్టిపారేస్తూ.. కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్నారు. ఏటా.. తాము మునుగుతున్నా ముందస్తు చర్యలు తీసుకోవాలన్న ముచ్చటే ఎవరికి పట్టడం లేదంటూ వాపోతున్నారు.

కడెం.. అంటేనే గుండె దడ

రెండేళ్లుగా వరద బీభత్సం కడెం ప్రాజెక్టును వెంటాడుతోంది. ఇప్పుడు మళ్లీ వానాకాలం రావడంతో గతరెండు సీజన్లలో తాము చూసిన జలప్రళయాన్ని తలుచుకుంటూ స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. 2022 జులై 13న దాదాపు 6 లక్షల క్యూసెక్కులతో ప్రాజెక్టును నిండా ముంచేస్తూ జలప్రళయం ఉప్పొంగింది. ఊరువాడా, చెట్టు చేమా.. ఏది కనిపించకుండా అన్నీ జలమయమయ్యాయి. లెక్కలేనంత పంటనష్టం జరిగింది. ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని స్థానికులు గడపాల్సి వచ్చింది. వారాల తరబడి కోలుకోలేక అవస్థలు పడ్డారు. ఈ క్షణాలను మరిచిపోకముందే గతేడాది (2023)లోనూ అదే బీభత్సం మళ్లీ ఎదురైంది. జులై 26న మళ్లీ భారీవరద ప్రాజెక్టును ముంచెత్తడంతో 'బతుకు జీవుడా..'అనుకుంటూ ఇక్కడి ప్రాంతప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వచ్చింది. రెండేళ్లుగా అంతటి మహాప్రవాహాలను తట్టుకుని కడెం ఆనకట్ట ప్రజల ప్రాణాలకు అడ్డుకట్టగా నిలిచింది. ఏమాత్రం గండిపడ్డా.. పరిస్థితి ఊహించని విధంగా ఉండేది. ఇంతటి ఘటనలు జరిగినా పాలన, అధికార యంత్రాంగాలు మాత్రం సరైన పాఠాలు నేర్వలేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

ముంచేస్తున్న సుద్దవాగు..

భైంసా పట్టణానికి వరప్రదాయినిగా ఉన్న సుద్దవాగుపై ఉన్న గడ్డెన్నవాగు ప్రాజెక్టు కూడా మూడేళ్లుగా స్థానికులకు దుఃఖదాయినిగా మారుతోంది. ప్రతీ సీజన్‌లో లోతట్టు ప్రాంతాలను ముంచేస్తోంది. ఇందుకు ప్రాజెక్టు రెడ్‌జోన్‌లోనే నిర్మాణాలు ఉండటం, పలు కాలనీలు లోతట్టుగా మారడమే కారణాలుగా గుర్తించారు. కానీ చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. రెండేళ్ల క్రితం ఒక్కసారిగా వరద విరుచుకుపడటంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తాల్సి వచ్చింది. దిగువకు ఉప్పొంగిన సుద్దవాగు కాలనీలను నిండా ముంచేసింది. ఊహించని ఈ ఘటనతో స్థానికులు హాహాకారాలు పెట్టారు. అధికార యంత్రాంగం ప్రమాదకర పరిస్థితుల నుంచి వారిని కాపాడాల్సి వచ్చింది. గతేడాదీ ఇదే పరిస్థితి ఎదురైంది. ఆర్టీసీ డిపో సైతం మునిగిపోయింది. ఆఫీస్‌తోపాటు బస్సులు సైతం సగం వరకు నీట మునిగాయి.

జిల్లా కేంద్రం.. జలసంద్రం

పేరుకు జిల్లా కేంద్రమైనా ఇక్కడ ఎవరికీ ఏ పట్టింపులు ఉండవు. నిర్మల్ సైతం మూడేళ్లుగా నీటమునుగుతూనే ఉంది. 2021 జులైలో కనీవిని ఎరుగని రీతిలో స్వర్ణ ప్రాజెక్టు నీళ్లు శివారు కాలనీలను ముంచెత్తాయి. సిద్ధాపూర్‌తోపాటు పక్కనే ఉన్న జీఎస్ఆర్ కాలనీ మొత్తం జలసంద్రంగా మారింది. వేకువజామునే చుట్టుముట్టిన వరదలో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని రెండంతస్తుల ఇళ్లపైకెక్కారు. స్థానికులు, గంగపుత్రులు పడవల్లో వెళ్లి ఒక్కొక్కరినీ తీసుకువస్తూ ప్రాణాలను కాపాడారు. ఈ క్షణాలను ఇప్పటికీ తలచుకుంటూ ఆ కాలనీవాసులు వణుకుతున్నారు. ఆ తర్వాత కూడా ప్రతీ వానాకాలం ఇదే పరిస్థితి ఎదురవుతోంది. సీజన్ ప్రారంభమైందంటే మూటముల్లె సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. స్థానిక శివా జీచౌక్, డాక్టర్స్‌లైన్, వైఎస్ఆర్‌కాలనీ, ప్రియదర్శినినగర్, శాస్త్రీనగర్, ఇందిరానగర్, రవినగర్, భైంసారోడ్డు ఇలా పలు వీధులూ ప్రతీ వానా కాలం జలసంద్రాలే అవుతున్నాయి. రోడ్లు మొత్తం కాలువల్లా మారుతున్నాయి.

ఇంకెన్నాళ్లు మునగాలి...!?

- 2021.. అప్పుడేదో అవగాహన లేకపోవడం, ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో జరిగింది.
- 2022.. ముందస్తు చర్యలు తీసుకునేందుకు సమయం కూడా లేకపోవడం, ఊహించనంతగా వరద రావడంతో ఏం చేయలేకపోయాం.
- మరి.. 2023లో కూడా అదే దుస్థితి ఎందుకు ఎదురైంది..? ఈ ప్రశ్నకు ఇప్పటి వరకూ సమాధానం లేదు. ఇక ఈసారైనా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారా.. అంటే అలాంటివేవీ కనిపించడం లేదు.
- ప్రాజెక్టులకు పూర్తిస్థాయి మరమ్మతులు, ఎగువ నుంచి వచ్చే వరద అంచనాలు, దిగువన ముందే అలర్ట్ చేయకపోవడం ఇప్పటికీ అవే పొరపాట్లు కనిపిస్తున్నాయి. కలెక్టర్ వంటి జిల్లా అధికారులు ఉండే జిల్లాకేంద్రంలో నాళాలు, కాలువలపై ఆక్రమణలను తొలగించలేకపోవడం దారుణం. ఏదో తూతూమంత్రంగా మున్సిపల్ పనులు కొనసాగుతున్నాయి. కానీ.. శాశ్వతంగా ముంపు ముప్పు తప్పించే పనులు చేపట్టడం లేదు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే ఈసారీ మునగాల్సి వస్తుందన్న భయం స్థానికుల్లో కనిపిస్తోంది.



గత వానాకాలం జలసంద్రమైన జిల్లాకేంద్రం

ఏటా ఇలాగేనా..



వానాకాలమంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పేరుకు జిల్లా కేంద్రమైనా చిన్న వర్షానికే ముంపు బారిన పడుతోంది. మెయిన్ రోడ్లే నిండా మునిగిపోతున్నాయి. చెరువులు, కాలువలు, నాళాలపై ఆక్రమణలను తొలగించకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడుతోంది.
– పోశెట్టి, నిర్మల్

పకడ్బందీగా నులిపురుగుల నివారణ కార్యక్రమం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఈనెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నియంత్రణ కార్యక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1–19 వయసు గల పిల్లలు జిల్లాలో 1,92,000 మంది ఉన్నారని, ప్రతి ఒక్కరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలని సూచించారు. నులి పురుగుల వలన పిల్లలలో కలిగే నష్టాలు, మాత్రలను వేసుకోవడం వలన కలిగే లాభాలను పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్య, వైద్య, పంచాయతీ, శిశు సంక్షేమం, డీఆర్డీవో శాఖల సమన్వయంతో నులి పురుగుల నియంత్రణకు వందశాతం పిల్లలకు మాత్రలను అందించాలని తెలిపారు. సమీక్షలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ధనరాజ్, జడ్పీ సీఈవో గోవింద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీడబ్ల్యూవో నాగమణి, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సౌకర్యాలు కల్పిస్తాం



దర్గా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో హజ్రత్ దర్గా వద్ద ఈనెల 22, 23 ,24 తేదీల్లో నిర్వహించే ఉర్సే– ఏ –షరీఫ్ ఉత్సవాలకు సౌ కర్యాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. దర్గా ప్రాంతాన్ని గురువారం సందర్శించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, వీధి దీపాలు, శానిటేషన్ పరంగా అన్ని రకాల చర్యలు చేపడతామని వివరించారు. చైర్మన్ వెంట ఏఈ హరి భువన్, దర్గా నిర్వాహకులు సోఫీ సమాద్ పాషా, కౌన్సిలర్ అబ్దుల్ మతిన్, ముజాహిద్, మహమ్మ ద్ అన్వర్ పాషా తదితరులు ఉన్నారు.

పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పశువులను అక్రమంగా తరలించడం చట్ట విరుద్ధమని, ఎవరైనా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో పశువుల అక్రమ రవాణా, మాదకద్రవ్యాల నిర్మూలన వంటి అంశాలపై జిల్లా ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర, జిల్లా చెక్ పోస్టుల వద్ద పోలీసులు, పశుసంవర్ధక శాఖ అధికా రులు, నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. 14 ఏళ్లు నిండని పశువులను ఎట్టిపరిస్థితుల్లో రవా ణా చేయకూడదని తెలిపారు. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి..

జిల్లాల్లో మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లా ఏరియా ఆసుపత్రిలో డ్రగ్స్ డీ అడిక్షన్ కేంద్రాన్ని నిర్వహిస్తామని తెలిపారు. పోలీసు, ఎక్సైజ్ అధికారులు మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా పెంచాలన్నారు. ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ అనుమతి పత్రాలు లేకుండా పశువులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దులతో సహా మొత్తం 27 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. చెక్ పోస్టుల వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల రవాణా పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎస్పీ గంగారెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, డీఎంహెచ్‌వో ధనరాజ్, జెడ్పీ సీఈవో గోవింద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూములను ఆక్రమిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెవెన్యూ, పంచాయతీ, నీటిపారుదల, మున్సిపల్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ శాఖల అధికారులకు సూచించారు. నూతన లేఅవుట్ అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూముల ఆక్రమణలను గుర్తించామని తెలిపారు. బాధ్యులకు నోటీసులు జారీ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులు, తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

రెండోరోజూ 'డబుల్' ఆందోళన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి



డబుల్‌బెడ్రూం ఇంటి వద్ద బీడీలు చేస్తున్న మహిళ

భైంసాటౌన్: తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అప్పగించాలని లబ్ధిదారులు చేపట్టిన ఆందోళన రెండోరోజూ కొనసాగింది. పట్టణ శివారులోని డబుల్‌బెడ్రూం ఇళ్లలోకి బుధవారం చొరబడి నిరసన తెలిపిన లబ్ధిదారులు గురువారం స్థానిక బొర్ర గణేశ్ కూడలి వద్ద రాస్తారోకో చేశారు. దాదాపు రెండు గంటలపాటు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా వినిపించుకోకపోవడంతో ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ చేరుకుని వారితో మాట్లాడారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు పూర్తిస్థాయిలో నివాసయోగ్యంగా లేవని, నీరు, విద్యుత్, పారిశుధ్య వసతులు లేవని చెప్పారు. రూ.5.60 కోట్లతో వసతుల కల్పనకు ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇప్పటికే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అయినా లబ్ధిదారులు వినిపించుకోకుండా డబుల్‌బెడ్రూం ఇళ్లలోనే ఉంటామని వెళ్లిపోయారు.

'డబుల్‌బెడ్రూం' వద్దే మకాం..!

డబుల్‌బెడ్రూం ఇళ్లను పలువురు లబ్ధిదారులు ఆక్రమించుకున్నారు. ఈ మేరకు సామగ్రితో చేరుకుని మకాం వేశారు. కొందరు ఇళ్లకు తాళాలు వేసుకుంటుండగా, మరికొందరు పిల్లలతో చేరుకుని అక్కడే బీడీలు చుడుతూ గడుపుతున్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్లకు అర్హులుగా గుర్తించి, ఇళ్ల కేటాయిస్తూ ధ్రువపత్రాలు అందించి రెండేళ్లు కావస్తున్నా అప్పగించకపోవడంతో చేసేది లేక ఇళ్లలోకి వచ్చినట్లు పేర్కొంటున్నారు.

ఆశ వర్కర్లకు నష్టం కలిగించొద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశలు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్
- సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: ఆశ వర్కర్లకు నష్టం కలిగించేలా ఎగ్జామ్స్ పెట్టాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశ వర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 33 ఏళ్లు, మైదాన ప్రాంతంలో 19 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారన్నారు. కరోనా నియంత్రణలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆశ వర్కర్ల పని భారం తగ్గించాలి జాబ్ కార్డు ఇవ్వాలని కనీస ఫిక్స్‌డ్ వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ప్రతినెలా 2వ తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ను వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గంగామణి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు బి.సుజాత, అధ్యక్షురాలు చంద్రకళ, ఉపాధ్యక్షులు విజయ, ఇంద్రమాల, అనసూయ, కోశాధికారి రామలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు మంజుల, మౌనిక, రాధ, సుగ్న, సులోచన, కమల, సరిత పాల్గొన్నారు.

ఆస్పత్రిని బాగుచేసుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

- హెచ్‌డీసీ సమావేశంలో ఎమ్మెల్యే

భైంసా: అందరం కలిసి ఆస్పత్రిని బాగుచేసుకుందామని ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో పెద్దదైన భైంసా ఆసుపత్రికి పెద్ద సంఖ్యలోనే రోగులు వస్తారని అన్నారు. వారికి కావాల్సిన అన్ని సేవలు అందించాలని సూచించారు. నియోజకవర్గంలోని నిరుపేదలకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందించడమే తన లక్ష్యమన్నారు. భైంసా ఆస్పత్రిలో అన్నిరకాల సేవలను ప్రారంభించే విషయంపై దృష్టిసారిస్తామన్నారు. సీటీ స్కాన్ ఏర్పాటు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తే ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. ఏ అవసరాలు ఉన్నా తనకు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ సమయంలో రోగులు వచ్చినా చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. నియోజకవర్గ నిరుపేదలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో భైంసా ఎంపీపీ అబ్దుల్‌రజాక్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాబిర్‌అహ్మద్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- ఎస్పీ జానకీ షర్మిల



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీసు కార్యాలయంలో రిటైర్డ్ పీపీ రాములుతో కలిసి కొత్త చట్టాల శిక్షణ, ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కొత్త చట్టాలపై పూర్తి అవగాహనకు రావాలని తెలిపారు. పోలీసులందరికీ విడతల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూలై 1వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ.. భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, కొత్త చట్టాలను అనుసరిస్తూ.. ముందుకు సాగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహిస్తామన్నారు. కొత్త చట్టాలపై అవగాహన రావాలంటే నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలని తెలిపారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. ఇందులో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ సెట్‌లో ప్రతిభ



విష్ణువర్ధనచారి

సోన్: ఎడ్ సెట్(బీఈడీ) ఫలితా ల్లో సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామానికి చెందిన గజ్జల విష్ణువర్ధనచారి రాష్ట్రస్థాయిలో 63 ర్యాంక్ సాధించాడు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించిన బీఈడీ ప్రవేశ పరీక్షలో తన కుమారుడు మ్యాథమెటిక్స్ కంప్యూటర్ విభాగంలో ఉత్తమ ర్యాంకు సాధించాడని అతని తండ్రి గజ్జల గంగాధర్ తెలిపారు. రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన విష్ణువర్ధనచారిని గ్రామస్తులు అభినందించారు.

క్లుప్తంగా

హనుమాన్ ఆలయంలో చోరీ

భైంసాటౌన్: పట్టణ శివారులోని మిషన్ భగీరథ గ్రిడ్ సమీపంలోని ఏకముఖి హనుమాన్ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయంలో చొరబడిన దొంగలు హుండీ పగులగొట్టి సొత్తు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకుడు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఆలయ కమిటీ సభ్యుడు అవినాష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డి.రాజారెడ్డి తెలిపారు.

ఎస్సైపై సస్పెన్షన్ వేటు

నిర్మల్‌టౌన్: వెహికిల్ ఇన్సూరెన్స్ కేసు దర్యాప్తులో అవకతవకలకు పాల్పడి వాహన యజమానికి లబ్ధి చేకూర్చేలా యత్నించిన నిర్మల్ రూరల్(ప్రస్తుతం నిర్మల్ టౌన్) ఎస్సై కె.చంద్రమోహన్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్–1 ఐజీ రంగనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 2న ద్విచక్ర వాహనదారులు కారును ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు ఇన్సూరెన్స్ గడువు ముగియడంతో యజమాని ఫిబ్రవరి 3న ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేయించాడు. ప్రమాదానికి గురైన కారుకు ఇన్సూరెన్స్ వర్తించేలా ఎస్సై చంద్రమోహన్ వాస్తవాలను దాచి ప్రమాదం 6వ తేదీన జరిగినట్లు చిత్రీకరించాడు. ఫిబ్రవరి 13న కారు యజమానికి లబ్ధిచేకురేలా ద్విచక్రవాహనదారుడిపై కేసు నమోదు చేశాడు. దీనిపై ఎస్పీ జానకీ షర్మిల ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎస్సైని సస్పెండ్ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

మృతదేహాన్ని త్వరగా తెప్పించండి

ఖానాపూర్: దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్న పాత ఎల్లాపూర్‌కు చెందిన గల్ఫ్ కార్మికుడు కుంచపు గంగారాం మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తెప్పించాలని బాధిత కుటుంబీకులు కోరారు. ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ నాయకులు స్వదేశ్ పరికిపండ్లను జిల్లా కేంద్రంలో గురువారం కలిసి విన్నవించారు. ఈ మేరకు సంబంధిత వివరాలతో కూడిన అఫిడవిట్ పూర్తిచేసి సెక్రెటేరియట్‌లోని సాధారణ పరిపాలన విభాగ అధికారులకు మెయిల్ పంపినట్లు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్ ప్రాంతంలోగల మమత జిన్నింగ్ మిల్ వద్ద రోడ్డు పక్కన గురువారం గాయాలతో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు పంపించారు. మృతురాలి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుంది. మృతురాలి ఒంటిపై గులాబీ రంగు చీర, జాకెట్ ఉంది. మహిళను ఎక్కడో చంపి ఇక్కడ పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మహిళ ముఖం, ఒంటిపై గాయాలున్నాయి. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి సంబంధీకులు 8712659914 నంబర్‌లో లేదా టౌన్ సీఐ అశోక్‌ను 8712659920 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన పి.మహేశ్(35) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ డి.రాజారెడ్డి కథనం ప్రకారం.. మహేశ్‌కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలుగలేదు. ఈ క్రమంలో మనస్తాపం చెంది బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారిళ్లలో గాలించారు. కాగా, గురువారం ఉదయం స్థానిక బైల్‌బజార్ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాణం పోస్తున్నారు..

- రక్తదానానికి ముందుకు వస్తున్న యువత
- భైంసాలో నాలుగు రక్తదాన బృందాలు



రక్తదానం చేస్తున్న యువకుడు

భైంసారూరల్: రక్తదానం.. ప్రాణాలను నిలబెడతుంది. ఇది గుర్తించిన భైంసా పట్టణ యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వస్తోంది. పట్టణంలో నాలుగు గ్రూపులు ఏర్పాటు చేసి వేర్వేరుగా రక్తదానం చేస్తున్నాయి. బ్లడ్ దోనర్స్ గ్రూప్, అయోధ్య సేవా సమితి, ఐక్యత సేవా సమితి, హమారా సహారా వెల్ఫేర్ సొసైటీ.. ఇలా నాలుగు గ్రూపులు రక్తం కావాలని అడిగిన వెంటనే స్వచ్ఛందంగా దానం చేస్తున్నాయి. నాలుగు గ్రూపుల్లో 1,500 మందికిపైగా సభ్యులు ఉన్నారు. చుట్టు పక్కల ఏ ప్రమాదం జరిగినా, శస్త్రచికిత్సల్లో రక్తం అవసరమైన క్షణాల్లోనే సమాచారం అందుకుని రక్తం అందించేందుకు ముందుకువస్తున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇప్పటికే వేలాది మంది ప్రాణాలు నిలబెట్టిన దాతల అభిప్రాయం వారి మాటల్లో..



ఏ క్షణమైనా రెడీ



అయోధ్య సేవా సమితి తరఫున రక్తదానం చేసేందుకు మా సభ్యులు రెడీగా ఉంటారు. మనకు తెలిసిన వారు చుట్టు పక్కల చికిత్సలు తీసుకుంటే అక్కడ కూడా వెళ్లి రక్తదానం చేసి వస్తున్నాం. రక్తదానం చేసే సమయంలో ఆ కుటుంబం పంచే ఆప్యాయత ఎక్కడ దొరకదు. కళ్లముందే తమవారు అల్లాడుతుంటే మేము వెళ్లి రక్తదానం చేస్తుంటాం. కోలుకున్నాక ఎక్కడైనా కనిపిస్తే వీళ్లతోనే బతికామంటూ గొప్పగా చెబుతుంటారు.
– యోగేశ్, అయోధ్య సేవా సమితి గ్రూపు నిర్వాహకుడు

ఏడుసార్లు రక్తదానం చేసిన



భైంసా ఆసుపత్రుల్లో అత్యవసరంగా రక్తం కావాలని తెలియగానే నేను రక్తదానం చేశాను. ఇప్పటికీ ఏడుసార్లు రక్తదానం చేశాను. రక్తం అవసరమని ఏ గ్రూపులో వచ్చినా నేను స్పందిస్తాను. నాతోపాటు ఉండే నా ఫ్రెండ్స్ కూడా ఉత్సాహంగా ముందుకు వస్తారు. రక్తదానం చేయాలని మేమంతా నిర్ణయించుకున్నాం. రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలి. మనం చేసే రక్తదానం ఒకరి ప్రాణాలనే కాదు ఒక కుటుంబాన్నే నిలబెడుతుంది. – సాయి, భైంసా

సేవలు కొనసాగిస్తాం



బ్లడ్ డోనర్స్ గ్రూప్ ద్వారా అవసరం ఉన్న వారికి రక్తదానం చేస్తున్నాం. అత్యవసరంగా ఎవరు సమాచారం ఇచ్చిన మా తరఫున సేవలు చేస్తున్నాం. ఇప్పటికే వందలాది మందికి రక్తదానం చేశాం. రక్తం అవసరం ఉంటే గ్రూపులో పోస్టు చేయగానే యువకులు ముందుకువస్తున్నారు. ఈ సేవలు కొనసాగించేందుకు మా బృందంలో ఎంతో మంది యువకులు ముందుకు వస్తున్నారు.
– సురేశ్, బ్లడ్ దోనర్స్ గ్రూపు నిర్వాకుడు

సేవ చేసేందుకే..



ఎంతో మంది పేదలు రక్తం కోసం అల్లాడుతుంటారు. తమ వారిని ఆసుపత్రిలోచేర్పించి అవసరమైన రక్తం దొరకక ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి సంఘటనలు చూసి భైంసాలో ఐక్యత సేవా సమితిని ఏర్పాటు చేశాం. స్నేహితులంతా కలిసి ఈ గ్రూప్‌ను ప్రారంభించాం. కరోనా సమయం నుంచి సేవలు అందిస్తున్నాం. రక్తదానం చేసేందుకు మా సభ్యులు అందుబాటులో ఉంటారు.
– యోగేశ్, ఐక్యత సేవా సమితి నిర్వాహకుడు

పేదల ప్రాణాలు నిలిపేందుకు..



నియోజకవర్గంలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం దొరకక ఇబ్బందులు పడుతుంటారు. ఇలా చూసి ఒక గ్రూపు ఏర్పాటు చేయాలనుకున్నాం. సోషల్ మీడియా వేదికగా తెలిసినవారందరినీ గ్రూపులో చేర్పించాం. రక్తం అవసరం ఉంటే గ్రూపులో సమాచారం పోస్ట్‌చేస్తాం. సభ్యులు స్పందించి రక్తదానం చేసేందుకు ముందుకువస్తున్నారు. నిరుపేదలకు ఇలా సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం.
– అయూబ్, హమారా సహారా వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకుడు

ఎక్సైజ్ దాడులు


తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడెం: మండలంలోని నర్సాపూర్, నచ్చన్‌ఎల్లాపూర్, మాసాయిపేట్, మద్దిపడగ గ్రామల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు చేశారు. ఈ దాడుల్లో పది లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకం పారబోసినట్లు ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ తెలిపారు. గతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన పది మంది నిందితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇందులో ఎక్సైజ్ సిబ్బంది రషీద్, వెంకటేశ్, రవళి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబాతో పట్టుబడ్డ మహిళ

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 5 లీటర్ల గుడుంబాతో మండలంలోని ఇక్బాల్‌పూర్‌కు చెందిన మహిళ బూక్య లక్ష్మి పట్టుబడినట్లు ఎక్సైజ్ ఎస్సై వసంత్‌రావు తెలిపారు. ఇదివరకు గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డ ఇక్బాల్‌పూర్‌కు చెందిన సురేశ్‌తోపాటు లక్ష్మిని తహసీల్దార్ శివరాజ్ ముందు గురువారం బైండోవర్ చేసినట్లు తెలిపారు.



గుడుంబా విక్రేతలను బైండోవర్ చేస్తున్న అధికారులు

సాంఘిక బహిష్కరణపై ఆందోళన


కుభీర్‌లోని వివేకానంద చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న దళితులు

కుభీర్: మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో పార్డి(కె)గ్రామానికి చెందిన దళితులు తమను గ్రామస్తులు సాంఘిక బహిష్కరణ చేశారని గురువారం ఆందోళన చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పార్డి(కె)గ్రామంలో రెండు నెలలుగా ఎస్సీలకు(అంబేద్కర్ సామాజికవర్గం)వారికి అంబేద్కర్ విగ్రహం వద్ద కట్టే ప్రహరీ విషయంలో వివాదం ఏర్పడింది. ఆ విగ్రహానికి కొంత దూరంలో ఒక చబుత్రపై మారెమ్మ చిన్నపాటి విగ్రహం ఉంది. ఇరువర్గాల వారు అధికారుల దృష్టికి తీసుకురాగా అధికారులు పరిష్కారం కోసం చాలాసార్లు నచ్చజెప్పారు. ఈ విషయంలో గ్రామానికి చెందిన 10 మందిపై అట్రాసిటీ కేసునమోదు చేశారు. ఇటీవల డివిజన్‌స్థాయి అధికారులు గ్రామసభ ఏర్పాటు చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పారు. తమకు మందిరంలో పెళ్లి చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలన్నారు. దానికి గ్రామస్తులు పూజలు గాని పెళ్లి గాని హిందూ ధర్మం ప్రకారం చేసుకోవాలని తెలిపారు. తాము బౌద్ధ ధర్మం ప్రకారం చేసుకుంటామంటే గ్రామస్తులు ఒప్పుకోలేదు. దీంతో చేసేదిలేక అధికారులు వెళ్లిపోయారు. అప్పటి నుంచి గ్రామస్తులు తమతో మాట్లాడడం, పనులకు పిలవడం లేదని తెలిపారు. సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ ఎం.సోము, ఎస్సై పి.రవీందర్ నిరసనకారులతో మాట్లాడారు. నీటి, కరెంట్ సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: రూ.3,15,150 విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ జీవన్‌రెడ్డి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీకి చెందిన షేక్ అఫ్సర్ పట్టణంలోని భుక్తపూర్ కాలనీకి చెందిన అక్రం, మన్సూర్ వద్ద నిషేధిత పొగాకు ఉత్పత్తులు కొనుగోలు చేశాడు. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలోగల ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు తీసుకున్న గదిలో నిల్వ చేశాడు. ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుందామని ప్లాన్ వేశాడు. కానీ.. ఇంతలోనే సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి గదిలో నిల్వ చేసిన నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అఫ్సర్‌ను అరెస్ట్ చేయగా, అక్రం, మన్సూర్ పరారీలో ఉన్నారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్, మావల ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుడి హత్య కేసు విచారణ వేగవంతం

- సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు
- పోలీసుల అదుపులో మృతుడి భార్య

నార్నూర్: గాదిగూడ మండలం అర్జుని కొలాంగూడ శివారులో బుధవారం ఉదయం హత్యకు గురైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజానంద్ (40) కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ పర్యవేక్షణలో సీఐ రహీంపాషా ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది. బుధవారం హత్య జరిగిన స్థలంలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి విచారణ చేపట్టారు. స్వయంగా డీఎస్పీ హత్యకు గల కారణాలపై కుటుంబ సభ్యులను విచారించారు. తన కొడుకు మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి జాదవ్ బిక్కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదేరోజు రాత్రి 11గంటలకు అంత్యక్రియలు పూర్తి కాగా, 12 గంటల ప్రాంతంలో మృతుడి భార్య విజయలక్ష్మిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఆమెను విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, ప్రభుత్వ ఉపాధ్యాయుడు హత్య కేసును పోలీసులు చాలెంజ్‌గా తీసుకుని విచారణను వేగవంతం చేశారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని సీఐ రహీంపాషా తెలిపారు.

బతుకుదెరువు కోసం వచ్చి పిడుగుపాటుకు బలి


జాదవ్‌రామ్ మృతదేహం

తానూరు: బతుకుదెరువు కోసం మహారాష్ట్ర నుంచి పదేళ్ల క్రితం వచ్చిన ఓ వ్యక్తి నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వత్ గ్రామంలో ఓ రైతువద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. గురువారం వ్యవసాయ పనులు ముగించుకుని వస్తుండగా పిడగుపాటుతో మృతిచెందాడు. ఏఎస్సై శామ్యుల్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని భోకర్ తాలూక పాకి గ్రామానికి చెందిన జాదవ్‌రామ్(45) పదేళ్ల క్రితం ఎల్విత్ గ్రామానికి వచ్చాడు. పాలేరుగా పనిచేస్తున్నాడు.రోజు మాదిరిగానే గురువారం వ్యవసాయ పనులకు వెళ్లాడు. సాయంత్రం ఎడ్లబండిపై ఇంటికి తిరిగి వస్తున్న క్రమంతో ఉరుములు, మేరుపులతో కుడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడడంతో ఎడ్లబండిపై నుంచి కిందపడి మృతిచెందాడు. రాదవ్ రామ్ భార్య రుణుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురి ఊపిరి తీసిన ప్రహరీ


శంకర్ మృతదేహాన్ని వెలికితీస్తున్న తోటి కూలీలు


పోషం మృతదేహాన్ని వెలికితీస్తున్న స్థానికులు


హన్మంత్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- గోడ కూలి కూలీల మృత్యువాత
- జేసీబీతో రెండు గంటలు శ్రమించి మృతదేహాల వెలికితీత
- ఘటన స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, సీపీ
- న్యాయం చేయాలని కార్మిక సంఘాల డిమాండ్
- భవన నిర్మాణ అనుమతి రద్దుకు అదనపు కలెక్టర్ ఆదేశాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం/చింతలమానెపల్లి: బతుకుదెరువు కోసం వలస వచ్చిన ముగ్గురు కూలీల ప్రాణాలు మట్టిలో కలిశాయి. పనులు చేస్తుండగా ఒక్కసారిగా ప్రహరీ కూలి మీద పడడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరొకరు గాయాలతో బయటపడ్డారు. పోలీసులు, స్థానికులు రెండు గంటలపాటు శ్రమించి జేసీబీ, డ్రిల్లర్ సాయంతో మృతదేహాలను వెలికితీశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకున్న ఈ ఘటన మూడు కుటుంబాల్లో విషాదం మిగిల్చింది. మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో నందిని ఆస్పత్రి వైద్యురాలికి చెందిన నూతన భవన నిర్మాణ పనులకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన ఏనంక హన్మంత్(35), బాబాపూర్‌కు చెందిన ఆత్రం శంకర్(40), చింతలమానెపల్లికి చెందిన గోలెం పోషం(50), కౌటాల మండలం గుడ్లబోరి గ్రామానికి చెందిన మైదం రాములు, మరో ఇద్దరు కూలీలు వెళ్లారు. పిల్లర్ల మధ్యలో మట్టి, బండలు నింపుతుండగా సెల్లార్‌కు పక్కనే ఇతరులకు చెందిన శిథిలావస్థలో ఉన్న ప్రహరీ కూలి పోషం, శంకర్, హన్మంత్‌లపై పడడంతో దాని కింద నలిగిపోయి ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందారు. రాములును మరో ఇద్దరు కూలీలు బయటకు లాగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. మృతదేహాలపై పూర్తిగా మట్టి కూరుకుపోవడంతో స్థానిక సీఐ బన్సిలాల్, సిబ్బందితోపాటు జేసీబీ సహాయంతో రెండు గంటలపాటు శ్రమించి బయటకు తీశారు. ఘటన స్థలంలో మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఘటన స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఘటన స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, ఆర్డీవో రాములు, ఏసీపీ ప్రకాష్ పరిశీలించారు. భవన నిర్మాణ అనుమతి రద్దు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌ను ఆదేశించారు.

న్యాయం చేయాలని కార్మిక సంఘాల డిమాండ్

కార్మికులకు రక్షణ కరువైందని, మృతులు పోషం, హన్మంతు, శంకర్ కుటుంబాలకు న్యాయం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. సెల్లార్ నిర్మాణానికి అనుమతులు లేవని ఆరోపించారు. భవనం యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, డిమాండ్ చేశారు.

త్వరలో బిడ్డ పెళ్లి.. అంతలోనే మృతి

చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన ఏనంక హన్మంతు స్వగ్రామంలో కుమ్మరి పని చేసేవాడు. కులవృత్తిలో ఉపాధి లభించక కుటుంబంతో సహా మంచిర్యాల పట్టణంలో భార్య లక్ష్మి, కుమారుడు రాజేష్‌తో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. పని చేస్తేనే వీరి పొట్ట గడిచే పరిస్థితి. స్వగ్రామం రుద్రాపూర్‌లో వృద్ధులైన తల్లిదండ్రులు మారయ్య, బాయక్క ఉన్నారు. ఇటీవల కూతురు శివానికి పెళ్లి కుదిరింది. త్వరలో పెళ్లి చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇంతలోనే కుటుంబ పెద్ద హన్మంతు మృతితో విషాదం నెలకొంది.

కూలీకి వెళ్తేనే కడుపు నిండేది..

చింతలమానెపల్లికి చెందిన గోలెం పోషం కుటుంబానిది రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. బాబాసాగర్ గ్రామానికి చెందిన పోషం అక్కడి నుంచి చింతలమానెపల్లికి వలస వచ్చాడు. ఆర్థికంగా నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. భార్య గంగతో కలిసి కూలీ పనులు చేసేందుకు మంచిర్యాలకు వచ్చాడు. కుమారుడు శేఖర్ హైదరాబాద్‌లో పని చేస్తూ చదువుకుంటున్నాడు. బుధవారం ఎల్లారంలో మొక్కులు తీర్చుకున్న పోషం భార్య గంగ, కుమారుడు శేఖర్ ఇంటికి వచ్చారు. పోషం మంచిర్యాలకు వెళ్లి గురువారం సాయంత్రం మృత్యువాత పడ్డాడు.

భూమి లేక వలస వచ్చి..

బాబాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం శంకర్‌కు సోదరులు మల్లేష్, దుర్గాజీ ఉన్నారు. మల్లేష్ ఉపాధి కోసం మరో గ్రామానికి వెళ్లగా శంకర్, దుర్గాజీ గ్రామంలోనే నివాసం ఉండేవారు. జీవనం సాగించడానికి వీరి వద్ద ఉన్న భూమి సరిపోకపోవడంతో తమ్ముడు దుర్గాజీకి భూమి అప్పగించి భార్యాపిల్లలతో శంకర్ మందమర్రి మండల కేంద్రంలో ఉంటున్నాడు. మంచిర్యాలలో కూలీ పనికి వచ్చి వెళ్తుండేవాడు. భార్య ధనలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు సిరివెన్నెల, హర్షితరాణిలతో నివాసం ఉంటున్నాడు. కూలీ డబ్బులతో పిల్లలను చదివిస్తున్నాడు.

ఇరువర్గాల మధ్య గొడవ

- పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్తత

ఇచ్చోడ: మండల కేంద్రంలో నిర్మల్ బైపాస్ వద్ద గురువారం సాయంత్రం పశువులు తరలిస్తున్న వాహనం ఆపిన విషయంలో రెండువర్గాల మధ్య గొడవ జరిగింది. అనుమతి లేకుండా పశువులను తీసుకెళ్లవద్దని ఒకవర్గం యువకులు పశువులు తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఒకవర్గం యువకులపై మరో వర్గం యువకులు దాడి చేశారనే విషయం బైటకు రావడంతో ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో కొద్దిసేపు పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆదిలాబాద్ నుంచి ప్రత్యేక పోలీసు బలగాలను పిలిపించి రెండువర్గాల వారిని అక్కడి నుంచి పంపించారు. ముందస్తుగా వ్యాపార సంస్థలను మూసివేయించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి కేసులు నమోదు చేయనున్నట్లు ఇచ్చోడ సీఐ భూమేశ్ తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ, గుడిహత్నూర్ ఎస్సైలతో పాటు ప్రత్యేక పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

ఎంపీకి శుభాకాంక్షల వెల్లువ



ఎంపీని సన్మానిస్తున్న కౌన్సిలర్లు

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఎంపీ గోడం నగేశ్‌ను గురువారం నిర్మల్ పట్టణ కౌన్సిలర్లు బిట్లింగ్ నవీన్, ఎడిపెల్లి నరేందర్, ఆదుముల్ల పద్మాకర్ ఆదిలాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

కడెం: బీజేపీ మండల అధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఎంపీ గోడం నగేశ్‌ను ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ నగేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. ఇందులో బీజేపీ నాయకులు జక్కుల సత్తెన్న, ముల్కి కృష్ణ, తిరుమల్, మోహన్‌నాయక్, రాంధన్, తదితరులు ఉన్నారు.

'వేధిస్తే 100కు డయల్ చేయండి'

నిర్మల్‌టౌన్: ఎవరైనా వేధిస్తే ఆందోళన చెందకుండా డయల్ 100కు ఫోన్ చేయాలని షీటీం పోలీసులు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గండి రామన్న సాయిబాబా ఆలయం వద్ద భక్తులకు అవగాహన కల్పించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధంవంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు రమాదేవి, రాధిక, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



సాయం అందజేస్తున్న ఏవో సోమలింగారెడ్డి

కుంటాల: కన్నవారి మృతితో అనాథలైన దివ్యాంగులకు ఆర్థిక చేయూతనందించి అండగా నిలిచారు ఏవో సోమలింగారెడ్డి. మండల కేంద్రానికి చెందిన సాంగి హంస నాలుగేళ్ల క్రితం, శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా వారి పిల్లలు అక్షయ, అనుప్రియ అనాథలయ్యారు. గురువారం ఏవో సోమలింగారెడ్డి రూ.10వేల నగదును అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, ఏఈవోలు శ్రీధర్, గణేశ్, మహేష్, ప్రగతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించాలి

కుంటాల: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని భైంసా గోపాలరావు పటేల్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సూచించారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ సరస్వతి, డాక్టర్ మురళి, ఎం.రాజు, సుభాష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

కుంటాల: ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు గురువారం విడుదలైనట్లు కుంటాల ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ ముత్యం, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సగ్గం గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 87 శాతం, ఇంటర్‌లో 61 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వారు పేర్కొన్నారు.

చిరుధాన్యాలపై రైతులకు అవగాహన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని మండల సమాఖ్య భవనంలో గురువారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళా సంఘం సభ్యులకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఎంటర్ ప్రినర్ షిప్ డెవలప్‌మెంట్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ మాస్టర్ ట్రైనర్ నిఖిల్ రెడ్డి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఈనెల 16 వరకు కొనసాగుతుందన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని 42 వార్డుల్లోని ప్రజలు గురువారం మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో ప్రజాపాలన దరఖాస్తులను అందజేశారు. గతంలో ప్రజాపాలనకు దరఖాస్తు చేసుకుని పథకాలకు అర్హత సాధించని వారి దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

అధికం.. అనర్థమే..!

- మోతాదుకు మించి ఎరువుల వాడకం
- పంట దిగుబడులపై ప్రభావం



అధిక ఎరువుల వినియోగంతో దెబ్బతిన్న పత్తి పంట (ఫైల్)



అందాకూర్‌లో సోయా మొలకెత్తకముందే ఎరువు వేస్తున్న రైతు

కుంటాల: వ్యవసాయ పంటల సాగులో అధిక దిగుబడి వస్తుందన్న ఆశతో రైతులు రోజురోజుకూ రసాయనిక ఎరువుల వాడకాన్ని అధిక మొత్తంలో వినియోగిస్తున్నారు. దీంతో నేలలో పోషకాలు తగ్గి పంటల దిగుబడులపై ప్రభావం చూపడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండించినా ఫలితం లేకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

అధికమొత్తంలో ఎరువుల వాడకం..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కుంటాల మండలంలో 12,450 ఎకరాల్లో పత్తి, 6,620 ఎకరాల్లో సోయా, 3,320 ఎకరాల్లో వరి పంటల సాగుకు రైతన్నలు శ్రీకారం చుట్టారు. ఏటా విత్తనం వేసిన నాటి నుంచి దిగుబడి వచ్చే వరకు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతున్నారు. తద్వారా పంట పొలాల్లో భాస్వరం నిలువలు పేరుకుపోతున్నాయి. సూక్ష్మ పోషకాలు తగ్గిపోతున్నాయి. పొంచిఉన్న ముప్పును నివారించేందుకు సేంద్రియ ఎరువులు వాడాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

అవసరం మేరకు వాడాలి

మండలంలోని ఆయా గ్రామాల్లో గత ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వాడడం ద్వారా పత్తి, సోయా పంటల దిగుబడులు తగ్గాయి. పంటల సాగుకు అవసరం ఉన్న మేరకు ఎరువులు వాడాలని అధికారులు సూచిస్తున్నారు. వరిసాగులో పిలకలు వేసే సమయంలో ఎకరాకు డీఏపీ 50 కిలోల బస్తా , చిరు పొట్టదశలో 25 కిలోల పొటాష్, పత్తి సాగులో డీఏపీ 50 కిలోలు, పూత, కాత సమయంలో 25 కిలోల యూరియా, కాయల సమయంలో 150+15 కిలోల పొటాష్, సోయ సాగులో దుక్కిలో డీఏపీ 50 కిలోల బస్తా, 25 కిలోల పొటాష్, పూత, పిందెదశలో 50 కిలోల యూరియా వేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

మోతాదుకు మించి వాడొద్దు



రైతులు పంటల సాగులో అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో నేలలో భూసారం తగ్గి దిగుబడులు రావడంలేదు. మోతాదుకు మించి ఎరువులు వాడవద్దు.

– సోమ లింగారెడ్డి, ఏవో, కుంటాల

'మొరం తవ్వకాలు నిలిపివేయాలి'



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

తానూరు: మండలంలోని ఎల్వత్, వాడవన శివారులోని ప్రభుత్వ భూముల్లో అక్రమ మొరం తవ్వకాలను నిలిపివేయాలని గురువారం గ్రామస్తులు తహసీల్దార్ లింగమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 177లోని 63.17 ఎకరాల భూమిని 16 ఏళ్ల క్రితం 43 మందికి సాగు చేసుకునేందుకు పంపిణీ చేశారన్నారు. మహారాష్ట్రకు చెందిన కొంతమంది ఆభూములను లీజుకు తీసుకుని మొరం తవ్వకాలు జరిపించి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు తరలిస్తున్నారన్నారు. పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో అందులో పశువులుపడి మృతువాత పడుతున్నాయన్నారు. అంతేకాకుండా దుమ్ముధూళి చేరి పంటలు చేతికి రాకుండా పోతున్నాయన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు శివదాస్, ఇస్మాయిల్, రాందాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి



హారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో ప్రసిద్ధి చెందిన సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు హారతి కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఏవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వసంత్‌రావు

సోన్: మండల వ్యవసాయ అధికారి (ఏవో)గా వసంత్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్‌రూరల్ మండలంలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఏఈవోలతో సమావేశం నిర్వహించి వానాకాలం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏఈవోలు రాథోడ్ అంబాజీ, అశోక్, రజనీ, పాల్గొన్నారు.

ఘనంగా సదర్ బోనాల పండుగ



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లిలో గురువారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సదర్ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపు నిర్వహించడంతో పాటు స్థానిక ఎల్లమ్మతో పాటు పోచమ్మ గ్రామదేవతలకు బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దొమ్మటి రఘుపతిగౌడ్, పంజాల పరంధాములు గౌడ్, పోతిగంటి విఠల్ గౌడ్, పెద్దులు గౌడ్, నరేష్ గౌడ్, మణిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా పనిచేయండి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

కడెం: అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యలు తెలుసుకునేందుకే పల్లెబాట కార్యక్రమం చేపట్టానన్నారు. కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు త్వరలోనే పూర్తిచేసి ఆయకట్టుకు సాగు నీరందిస్తామన్నారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. ఏవో సంధ్యారాణి మాట్లాడుతూ మండలంలో 300 క్వింటాళ్ల జీలుగా విత్తనాలు పంపిణీ చేశామని, మరో 300 క్వింటాళ్లు వస్తున్నాయన్నారు. ఎంఈవో మధుసూదన్ మాట్లాడుతూ మండలంలోని 36 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక కావడంతో పనులు చేపట్టామన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా డీఈలు వెంకటరమణ, హరీశ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు వెళ్లని గ్రామాలకు బోర్‌వెల్ ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. ఉద్యాన క్లస్టర్ అధికారి సాదుల మౌనిక మాట్లాడుతూ ఆయిల్ పాం సాగు చేసే రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈఈ సుమన్‌కుమార్ మాట్లాడుతూ గంగాపూర్, అల్లంపల్లి, ఉమ్మ డి గ్రామ పంచాయతీలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు దత్తోజీపేట్ వద్ద నూతన సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతి పాదనలు పంపామన్నారు. అంతకు ముందు డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ ఎమ్మెల్యేను సన్మానించారు.

'డబుల్' ఆక్రమణ సరికాదు

రాజకీయ లబ్ధికోసం కొందరు నాయకులు డబుల్ బెడ్ రూం ఇళ్లు అక్రమించుకోవాలని ప్రజలను రెచ్చగొట్టారని, వారు ఏ పార్టీకి చెందిన వారైనా వదిలిపెట్టమని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రజలు డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆక్రమించుకోవడం సరికాదని, వెంటనే ఖాళీ చేయాలన్నారు. గ్రామసభలు నిర్వహించి అర్హులకే పంపిణీ చేస్తామన్నారు. ఇందులో పైరవీలకు ఆస్కారం లేదన్నారు. అర్హులైన పేదలు ఇళ్ల కోసం తనను కలవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో అనిత, ఎంపీపీ అలెగ్జాండర్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ రఫీక్, ఆర్ అండ్‌బీ డీఈ మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న చెరువులు

- ఎత్తిపోతల పథకం కోసం ఎదురుచూపులు
- గోదావరి జలాలతో నింపాలని డిమాండ్



నీరు లేక వెలవెలబోతున్న ధర్మోర పెద్ద చెరువు

లోకేశ్వరం: పక్కనే గోదావరి నీరు ప్రవహిస్తున్నా గ్రామాల్లోని చెరువుల్లో మాత్రం చుక్కనీరు కనిపించడంలేదు. ఎక్కడ చూసినా చెరువులు ఎడారిని తలపిస్తున్నాయి. రానున్న రోజుల్లో నీటి కష్టాలు తప్పేలా లేవు. ఎస్సారెస్పీలో నిండుగా నీరుండి దిగువకు ప్రవహిస్తుంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో అటుపక్కన నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని అన్ని గ్రామాల చెరువులు నింపేందుకు గుప్త ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. కానీ గోదావరి ప్రవహించి ఎస్సారెస్పీ పూరిగా నిండిన తర్వాత వచ్చిన నీటిని దిగువకు వదులుతారు. నందిపేట్ మండలంలోని చెరువులు నిండుగా ఉండి జలకళను సంతరించుకుంటే నిర్మల్ జిల్లాలోని చెరువులు, కుంటలు వెలవెలబోతున్నా యి. జిల్లాలో గోదావరి నది ఒడ్డున గుప్త లాంటి ఎత్తిపోతల పథకం నిర్మించి జిల్లాలోని చెరువులను నింపాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నా రు.

ఎడారిలా చెరువులు...

ఎస్సారెస్పీ పక్కనే కుంటాల, లోకేశ్వరం, బాసర, ముధోల్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జీ)మండలాలు ఉన్నాయి. కానీ ఆయా మండలాల్లోని చెరువులకు నీరుచేరే మార్గం లేదు. ఎస్సారెస్పీని ఆనుకుని ఉన్న ప్రాంతంలో గుప్తలాంటి ఎత్తిపోతల పథకం నిర్మించి కుంటాల, లోకేశ్వరం, ముధోల్, బాసర మండలాల్లోని చెరువులను నింపుతామన్న ప్రభుత్వాల హామీలు అమలు కావడం లేదు. పక్కనుంచే గోదావరి జలాలు వెళ్తున్నా తమ మండలాలు మాత్రం నీరులేక అల్లాడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి గుప్త లాంటి ఎత్తిపోతల పథకంను నిర్మించి పైపుల ద్వారా చెరువులు నింపాలని కోరుతున్నారు.

చుక్క నీరు చేరలేదు



లోకేశ్వరం చుట్టుపక్కల కుంటలు, చెరువులు కలిపి దాదాపు పది వరకు ఉన్నాయి. చెరువుల్లో చుక్క నీరు లేదు. చెరువులను నింపితే ఆయకట్టు కింద పంటలు పండుతాయి. లోకేశ్వరం మండల కేంద్రంలోని చెరువులను లిఫ్ట్‌ద్వారా నింపితే కొంతవరకు నీటి కొరతను అధిగమించ వచ్చు.

– నాలం గంగాధర్, లోకేశ్వరం

లిఫ్ట్ ద్వారా చెరువు నింపాలి



గోదావరిలో పుష్కలంగా నీరున్నా మా మండలంలోని చెరువులు, కుంటల్లో చుక్కనీరు లేదు. లిఫ్ట్‌ద్వారా మండలంలోని చెరువులు కుంటలు నింపి ఆయకట్టుకు నీరందిస్తే పూర్తి పంటలు పండుతాయి.

– అసీబొద్దీన్ పటేల్, ధర్మోర

బక్రీద్ శాంతియుతంగా జరుపుకోవాలి

సారంగపూర్: ముస్లింలు బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సల్ల శ్రీకాంత్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఆయా గ్రామాల మజీద్ కమిటీ సభ్యులు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

ముధోల్: మండలంలోని ఆష్ట, బ్రహ్మన్‌గావ్ గ్రామాల్లో గురువారం ఏఈవో రుషికేష్ విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి చేసుకోవడం వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు. విత్తనం ద్వారా, నేల ద్వారా వచ్చే తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు.



బోనమెత్తిన కొత్త మద్దిపడగ

కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామంలో గురువారం పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు, యువతులు ఇంటికో బోనంతో డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా గ్రామ ప్రధాన వీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు. పిల్ల, జెల్ల, పాడి, పంటలను చల్లగ చూడాలని పోచమ్మకు బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కుకున్నారు. పూజలు చేశారు. - (కడెం)

ఎంపీపీ, వైద్యురాలి మధ్య వాగ్వాదం

కుంటాల: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం సీజనల్ వ్యాధులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీపీ, పీహెచ్‌సీ వైద్యురాలి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్ మాట్లాడుతూ వై ద్యురాలు శృతిరెడ్డి పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. ఆసుపత్రి సలహా సంఘం అ ధ్యక్షుడిగా సూచించిన సలహా సంఘ సమావేశం ఏర్పాటు చేయడంలో వైద్యురాలు నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. వైద్యురాలు శృతి రెడ్డి మాట్లాడుతూ మహిళా ఉద్యోగినని కూడా చూడకుండా సమావేశంలో అవమానించడం సమంజసం కాదని కంటతడి పెట్టింది. తాను ఆస్పత్రికోసం సొంతంగా డబ్బులు ఖ ర్చు చేసినా సదరు నిధుల కోసం ఎంపీపీ ఎందుకు సంతకం చేయలేదన్నారు. ఆస్పత్రిలో తూతూ మంత్రంగా పనులు చేపట్టడంతో పైనుంచి పెచ్చులూడి పడ్డాయన్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో అసలు సమావేశం పక్కదారి పట్టింది.

పోస్టర్ ఆవిష్కరణ

ముధోల్: మండల కేంద్రంలో గురువారం ఏఐఎస్‌బీ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్) 74వ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేతాజీ ఆశయాల సాధనకు, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సోషలిజం సాధనకో సం ఏఐఎస్‌బీ 1951లో పశ్చిమ బెంగాల్‌లో ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ముధో ల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వాగ్మారే అమూల్, ప్రతినిధులు చింటూ, దిలీప్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొన్నేళ్లుగా విద్యార్థులు లేని కారణంగా తరగతులను నిర్వహించలేదు. ఇటీవల బర్కత్‌పుర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టర్, డీఈవో, ఎంఈవోలకు వినతిపత్రాలు అందజేశారు. బుధవారం బడిబాట కార్యక్రమానికి హాజరైన కలెక్టర్, డీఈవోలను సైతం కాలనీవాసులు కలిసి విన్నవించారు. దీంతో స్థానిక మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది గురువారం పాఠశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారు.

బీమా చెక్కు అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఎం.అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.12 చెల్లించడంతో ఇన్సూరెన్స్ క్లెయిమ్ అయిందని మేనేజర్ కే.శ్రీనివాస్ తెలిపారు. బాధితుడి తల్లి రాజవ్వకు రూ.2లక్షల చెక్కును అందజేశారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

లోకేశ్వరం: మిషన్ భగీరథ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో సోలమన్‌రాజ్ అన్నారు. గురువారం మండలంలోని నగర్, పంచగుడి, పిప్రి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు.

హాజరుశాతం పెంచాలి

లోకేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని కన్కపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం కన్కపూర్, రాయపూర్‌కాండ్లీ గ్రామాల్లో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

భైంసారూరల్: పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని పేండ్‌పెల్లిలో పర్యటించారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. రోడ్లపై చెత్తా చెదారం లేకుండా చూడాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి గాయత్రి, గ్రామస్తులు ఉన్నారు.